నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

రసూల్‌పురా: విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా కంటోన్మెంట్ మడ్‌ఫోర్ట్ 11 కేవీ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు మడ్‌ఫోర్ట్, కంటోన్మెంట్ వర్క్‌షాపు, కార్ట్ మాస్టర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు సికింద్రాబాద్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ మురళీకృష్ణ తెలిపారు. బాలాజీ ఎన్‌క్లేవ్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని గన్‌రాక్ ఫేజ్-1, ట్రాన్స్‌పోర్ట్ రోడ్, రాఘవ కాలనీ, ఎస్‌బీఐ కాలనీ, బాలాజీ ఎన్‌క్లేవ్, వెంకటరమణ కాలనీ, టెక్స్‌బుక్ కాలనీ, కార్ఖాన పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట వరకు, జింఖానా 11 కేవీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గన్‌రాక్ ఏ, బీ, సీ, సూర్య నగర్, అమరావతి కాలనీ అవంతి కాలనీ, న్యూ వాసవీ నగర్ పరిసర ప్రాంతాల్లో తుర్కపల్లి ఫీడర్ పరిధిలోని మానసంతోషి కాలనీ, కళాసిగూడ, బర్ట్స్ కాలనీ, రైల్వే కాలనీ, వీబీ సిటీ, ఏఆర్‌కే హోమ్స్ పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం మూడు నుంచి నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో...) టమాటా. 13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 18, క్యాప్సికమ్ 35, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 9, క్యారెట్ 18, దొండ 40, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 40, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 28, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 30, ఆలుగడ్డ 20, చామగడ్డ 41, మొరంగడ్డ 28, కందగడ్డ 65, సొరకాయ 13, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 4-5, ముల్లంగి 5-6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

వలస బాధితులకు హెల్ప్‌డెస్క్


హెల్ప్ డెస్క్‌ను ప్రారంభిస్తున్న కో ఆర్డినేటర్లు

సనత్‌నగర్: వలసదారులకు అండగా నిలబడేందుకు 'డాన్‌బాస్కో ఫర్ మైగ్రేంట్స్' పేరిట హెల్ప్‌డెస్క్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. దేశ నలుమూలల నుంచి ఉపాధి, ఇతర అవసరాల నిమిత్తం నగరానికి వస్తున్న వలసదారులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని డాన్‌బాస్కో సంస్థ ఈ హెల్ప్ డెస్క్‌ను ప్రవేశపెట్టింది. ఎర్రగడ్డ రైతుబజార్ ఎదురుగా గల సనత్‌నగర్ సెయింట్ థెరిస్సా చర్చి ప్రాంగణంలో ఉచిత హెల్ప్ డెస్క్‌ను సంస్థ జాతీయ కో-ఆర్డినేటర్ ఫాదర్ ఫ్రాన్సిస్ బాస్కో దిశ కో-ఆర్డినేటర్ ఐవాన్ వాజ్‌తో కలిసి ప్రారంభించారు. గ్రేటర్ పరిధిలో నివాసం ఉంటూ సమస్యల బారిన పడి కొట్టుమిట్టాడుతున్న వలసదారులకు తమ హెల్ప్‌డెస్క్ ఉచితంగా సేవలు అందిస్తుందన్నారు. సహాయం కోసం డాన్‌బాస్కో ఫర్ మైగ్రేంట్స్ ఉచిత టోల్ నెంబర్ 96423 72372లో సంప్రదించవచ్చన్నారు.

రోగులకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలి

జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి


పాల్‌దాస్ ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ వెంకటి

రాంగోపాల్‌పేట్: బస్తీ దవాఖానాలోని వైద్యులు, వైద్య సిబ్బంది మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటి అన్నారు. గురువారం ఆయన సికింద్రాబాద్ మినిస్టర్ రోడ్‌లోని పాల్‌దాస్, శ్యామ్‌లాల్ బిల్డింగ్‌లోని బస్తీ దవాఖానాల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది పనివేళలు పాటిస్తున్నారా సరైన వైద్య సేవలు అందిస్తున్నారా అని ఆరాతీశారు. రికార్డులను పరిశీలించి అందించిన వైద్య సేవలు ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

27, 28 తేదీల్లో దండోరా రాష్ట్ర మహాసభలు

ఉస్మానియా యూనివర్సిటీ: నాగార్జునసాగర్‌లో ఈ నెల 27, 28 తేదీలలో మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర మహాసభలు జరగనున్నాయి. గురువారం మాదిగ స్టూడెంట్ యూనియన్ అధ్యక్షులు బొర్ర శాంతికుమార్ ఆధ్వర్యంలో కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. మహాసభల్లో సమస్యలు, పరిష్కారానికి చేయాల్సిన పోరాటలను చర్చిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో బోనాల అరుణ్,వినయ్, వెంకట్, రఘురాం, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యం చేయండి సారూ..!

● బొల్లారం జనరల్ ఆసుపత్రిలో పేదలకు అందని వైద్యం ● సౌకర్యాలు అంతంతే.. ● అంబులెన్సులున్నా సేవలు శూన్యం

బొల్లారం జనరల్ ఆసుపత్రిలో ప్రజలకు వైద్యం అందడమే గగనమైపోయింది. ఏ డాక్టరు ఎప్పుడొస్తాదో.. ఎవరుంటారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇక సిబ్బంది నిర్లక్ష్యం తారాస్థాయికి చేరుకుంది. ఎవరూ పట్టించుకోకపోడం వల్ల ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందని ద్రాక్షే అయింది.



బొల్లారంలోని కంటోన్మెంట్ జనరల్ ఆసుపత్రి


ఔట్ పేషెంట్ విభాగం

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో కొనసాగుతున్న బొల్లారం జనరల్ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులకు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా వైద్యం పడకేసింది. కంటోన్మెంట్ బోర్డు సీఈవో, హెల్త్ సూపరింటెండెంట్ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా రోగులకు నాణ్యాత వైద్యం అందడం లేదు. వైద్యం కోసం ప్రతి రోజూ 250 నుంచి 300 మంది ఇక్కడికి వస్తుంటారు.వారంతా సరైన వసతులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆసుపత్రిని సందర్శించి రోగులకు సరైన వసతులు కల్పించాలని నాణ్యమైన వైద్యం అందించాలని ఆదేశించినా ఫలితం లేకుండా పోయింది. వందల సంవత్సరాల చరిత్ర ఉన్నా ఈ ఆసుపత్రి కాలక్రమేణా 75 పడకల జనరల్ ఆసుపత్రిగా రూపుదిద్దుకున్నప్పటికీ సరైన వైద్యం అందడం లేదు.



కానరాని రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ విభాగం సిబ్బంది

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో కానరాని సౌకర్యాలు...

కంటోన్మెంట్ జనరల్ ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటి ఆసుప్రతి సేవలు అందుబాటులోకి తీసుకువస్తామని ప్రకటించినప్పటికి ఇక్కడ కనీస వసతులు కానరావు. బయో మెట్రిక్ హాజరు లేకపోవడంతో వైద్యులు, సిబ్బంది తమ ఇష్టానుసారంగా ఆసుప్రతికి హాజరవుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆసుపత్రిలోని ఫార్మసీలో మందుల కొరత ఉండడంతో బయటి నుంచి వేలాది రూపాయలు చెల్లించి మందులు కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఇక రోగుల నుంచి ఫీజుల రూపంలో, మందుల కొనుగోలు విషయమై డబ్బు వసూలు చేస్తున్నా మాన్యూవల్ బిల్లులు కొనసాగుతుండడంతో వాటికి లెక్కా పత్రం ఉండదని ఆరోపణలు ఉన్నాయి. సక్రమంగా లేని హౌస్ కీపింగ్ సేవలు, ఇన్‌పేషంట్ వార్డుల్లో తిరగని ఫ్యాన్లు, ఆసుపత్రిలో పాథాలజి ల్యాబ్, ఎండోస్కోపింగ్, ఎకోటెస్ట్‌లు నిర్వహించేందుకు యంత్రాలు లేవు. ఎక్సేరే మిషన్ ఉన్నా రేడియాలజిస్ట్ అందుబాటులో ఉండడని, ఆసుపత్రిలో థర్మామీటర్లు, బీపీ నిర్ధారణ మిషన్లు ఉన్నప్పటికి సక్రమంగా పని చేయడం లేదని ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు మచ్చు కైనా కాన రావని రోగులు పేర్కొంటున్నారు.

అందుబాటులో లేని అంబులెన్సులు

బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి, మేగా కంపనీ అందజేసిన 108 అంబులెన్స్ ఉన్నా, రోగుల పరిస్థితి విషమిస్తే వారిని నగరంలోని ఇతర ఆసుపత్రులకు తీసుకె ళ్ళేందుకు అంబులెన్స్‌లు అందుబాటులో ఉండవని రోగులు ఆరోపిస్తున్నారు. ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు బోర్డుకు వెళ్ళాలన్నా అంబులెన్స్‌లో రాకపోకలు సాగిస్తుంటారని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీగణేష్, బోర్డు సీఈవో మధుకర్ నాయక్, హెల్త్ సూపరిటెండెంట్ దేవేందర్ దష్టి సారించి రోగులకు నాణ్యతతో కూడిన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటా

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్..

సనత్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కరించడంలో తాను ముందుంటానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. గురువారం సనత్‌నగర్‌లోని పలు ప్రాంతాల్లో వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. స్థానిక ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన ఆయన సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముందుగా బల్కంపేట శ్మశానవాటిక సమీపంలో డీసీఎం వాహనాలను పార్కింగ్ చేయకుండా ట్రాఫిక్ పోలీసులు తొలగిస్తున్నారని పలువురు వాహనదారులు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను విన్నవించారు. దీంతో గురువారం ట్రాఫిక్ పోలీసు అధికారులతో కలిసి డీసీఎం పార్కింగ్ ప్రాంతానికి చేరుకుని ట్రాఫిక్‌కు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వాహనాలను నిలుపుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఎస్సార్టీకాలనీలోని భగత్‌సింగ్ పార్కు వద్ద రూ.20 లక్షల వ్యయంతో నూతన రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించగా, ఆ పనులను పరిశీలించేందుకు ఎమ్మెల్యే వెళ్లగా స్థానికులు ప్రస్తుత అవసరాలను దృష్టిలో ఉంచుకొని సీవరేజ్ లైన్‌ను రీమోడలింగ్ చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, డీసీ రజనీకాంత్‌రెడ్డి, ఈఈ వెంకటేశ్వర్‌రెడ్డి, డీఈ వాసుదేవరెడ్డి, వాటర్‌వర్క్స్ జీఎం హరిశంకర్, ఏఎంఓహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వనం ఝాన్సీ, సిరిపురం యాదయ్యకు పలువురి నివాళి


నివాళులర్పిస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

బౌద్ధనగర్: పద్మశాలి సంఘానికి చెందిన వీర వనిత వనం ఝాన్సీ, తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన సిరిపురం యాదయ్యల వర్ధంతి వేడుకలు వారాసిగూడలోని పద్మశాలి సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం, సంఘం నాయకులు మాట్లాడుతూ వనం ఝాన్సీ వీర వనితలా గ్రామ స్థాయి నుంచి కేంద్ర స్థాయికి ఎదిగారన్నారు. సిరిపురం యాదయ్య చిన్న వయస్సులోనే ప్రత్యేక తెలంగాణ సాధనకై ఉస్మానియా గేటు వద్ద ఆత్మార్పణం చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎనగంటి రాజు, శ్యాంసుందర్, బొమ్మ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు


కాంగ్రెస్ నేతల సమావేశంలో సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ

సనత్‌నగర్: తమ దృష్టికి వచ్చిన సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కారం జరిగే వరకు నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో కృషి చేయాలని ఏఐసీసీ సభ్యురాలు, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ సూచించారు. బేగంపేట సింధికాలనీలో జరిగిన నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నీలిమ దృష్టికి తీసుకువచ్చారు. వాటిని అధికారులకు తెలియజేసి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఫోన్ ద్వారా విజ్ఞప్తి చేశారు. సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడడంలో నేతలు ముందువరుసలో ఉండాలన్నారు. నిత్యం ప్రజల్లో తిరుగుతూ వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం జరిగేలా చూడడంలో కీలకంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు విశాల్ సూదం, రమేష్, హనీఫ్, చిరంజీవి, మునీర్, కృష్ణ, జగదీష్, శేఖర్, మనోజ్, పర్వేజ్ దతితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందించాలి


విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కంటోన్మెంట్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తగిన క్రీడా వసతులు కల్పించాలని బీఆర్‌ఎస్ నేత టింకూ గౌడ్ అన్నారు. బోయిన్‌పల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఆరుగురు రాష్ట్ర స్థాయి అండర్-14 కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. హైదరాబాద్ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే పోటీల్లో పాల్గొనే విద్యార్థినులు తులసి, మంగాయమ్మ, విజయ లక్ష్మి, లోహిత, వాసిని, దివ్యలను అభినందించి, వారికి కిట్‌లు అందజేశారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులకు అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో బోయిన్‌పల్లి జిల్లా పరిషత్ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు చాముండేశ్వరి, ఫిజికల్ డైరెక్టర్ లీల తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: పెండింగ్ స్కాలర్‌షిప్‌లను తక్షణం విడుదల చేయాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ (టీజీవీపీ) రాష్ట్ర అధ్యక్షులు నక్క శ్రీశైలం యాదవ్ గురువారం డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయనందున గత మూడు సంవత్సరాలుగా వివిధ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థుల సర్టిఫికెట్లు కాలేజీలల్లోనే మగ్గుతున్నాయని పేర్కొన్నారు. రూ.7000 కోట్ల బకాయిలకుగాను రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.100 కోట్లను మాత్రమే విడుదల చేసినందున ఒక్కొక్క కాలేజీకి లక్ష రూపాయలు కూడా రానందున విద్యార్థుల సర్టిఫికెట్లను ఇవ్వడం లేదన్నారు. తక్షణం పెండింగ్ స్కాలర్‌షిప్ లను విడుదల చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు.

ఆస్ట్రేలియా ప్రతినిధులతో ఓయూ అధికారుల చర్చలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అధికారులు గురువారం ఆస్ట్రేలియా సర్టిఫైడ్ అకౌంటెంట్స్ (ఏసీసీఏ) ప్రతినిధుల బృందంతో చర్చలు జరిపారు. కామర్స్ విభాగంలో బోధన, పరిశోధనలు, అకడమిక్, శిక్షణ భాగస్వామ్యంతో పాటు పలు రంగాల్లో పరస్పర అవగాహన ఒప్పందాల పై ఉన్న అవకాశాల గురించి చర్చించినట్లు పేర్కొన్నారు.

ముగ్గురు పిల్లలతో తల్లి అదృశ్యం



చిలకలగూడ : ముగ్గురు పిల్లలతో సహా తల్లి అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ అనుదీప్, ఎస్‌ఐ జ్ఞానేశ్వర్ తెలిపిన మేరకు.. మెట్టుగూడకు చెందిన పవన్‌పాశ్వాన్, మిథిలేష్‌దేవి (36) భార్యభర్తలు, వీరికి సౌరభ్‌కుమార్ (12), కృష్ణకుమార్ (8), రిషికకుమారి (5) పిల్లలు. పవన్‌పాశ్వాన్ సికింద్రాబాద్‌లోని ఆల్ఫా హోటల్, పూజాదేవి పద్మజా హోటల్‌లో పని చేస్తుంటారు. ప్రతిరోజు మాదిరిగానే ఈనెల 10న వేకువజామున 4 గంటలకు పవన్‌పాశ్వాన్ విధులకు హాజరై తిరిగి సాయంత్రం ఇంటికి చేరుకోగా తాళం వేసి ఉంది. ఆరా తీయగా అదేరోజు ఉదయం 5 గంటలకు పూజాదేవి తన ముగ్గురు పిల్లలను తీసుకుని బయటకు వెళ్లి తిరిగి రాలేదని తెలిసింది. సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది. పరిసర ప్రాంతాలతోపాటు సన్నిహితులు, బంధుమిత్రులను వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో భర్త పవన్‌పాశ్వాన్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వృత్తి నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి


గాంధీ కళాశాలలో శిక్షణ తరగతులప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

గాంధీఆస్పత్రి : వైద్యవిద్య బోధనలో ఆధునిక పద్ధతులు పాటించి వృత్తి నైపుణ్యాలను మరింత మెరుగుపర్చుకోవాలని గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర అన్నారు. గాంధీ మెడికల్ కాలేజీ ప్రాంగణంలోని రీజనల్ ట్రైనింగ్ సెంటర్‌లో 'బేసిక్ కోర్స్ ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్' శిక్షణ కార్యక్రమాన్ని గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సీహెచ్‌ఎస్ రాజకుమారితో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఇందిర మాట్లాడుతూ.. నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆదేశాల మేరకు తెలంగాణలోని 60 మెడికల్ కాలేజీలను మూడు రీజియన్లుగా విభజించామని, గాంధీ మెడికల్ కాలేజీ ఓ రీజనల్ కేంద్రంగా కొనసాగుతుందని వివరించారు. గాంధీ రీజియన్ పరిధిలోని 26 మెడికల్ కాలేజీల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులతో ఈ శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామన్నారు. వైద్యవిద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు కేవలం మార్కులే ప్రామాణికం కాదని, రోగులు, రోగి సహాయకులు, ఇతర విభాగాలకు చెందిన వైద్యులు, సిబ్బందితో కమ్యూనికేషన్ మెరుగుపర్చుకునేందుకు నూతన బోధన పద్ధతులు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. గాంధీ రీజనల్ సెంటర్ కన్వీనర్ ప్రొఫెసర్ కిరణ్ మాదల, కోకన్వీనర్ సుభోద్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ రవిశేఖరరావు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి


సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

కంటోన్మెంట్: ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్)ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. కంటోన్మెంట్ ఆరోవార్డు నందమూరి నగర్‌కు చెందిన సక్కుబాయికి ఇటీవల మోకాలి శస్త్ర చికిత్స జరిగింది. నిరుపేద కుటుంబానికి చెందిన సక్కుబాయికి తగిన సాయం అందించాల్సిందిగా మాజీ బోర్డు సభ్యుడు ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఆయన సీఎంఆర్‌ఎఫ్‌కు సిఫారసు చేయగా, రూ.35వేలు మంజూరైంది. సంబంధిత చెక్కును గురువారం మర్రి రాజశేఖర్ రెడ్డి లబ్ధిదారురాలికి అందజేశారు.

జేఎన్‌టీయూ వీసీ ప్రొ.కిషన్ రెడ్డికి సన్మానం



ఉస్మానియా యూనివర్సిటీ: జేఎన్‌టీయూ నూతన వీసీ ప్రొ.కిషన్‌రెడ్డికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ ఆధ్వర్యంలో సన్మానం నిర్వహించారు. గురువారం వీసీ ఛాంబర్‌లో ప్రొ.కిషన్ రెడ్డిని శాలువతో సన్మానించారు. ఇంజినీరింగ్ కాలేజీల్లో నాణ్యమైన విద్యను అందించాలని కోరినట్లు తెలిపారు.

ఓయూ అధికారులకు న్యాక్ గుర్తింపు టెన్షన్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అధికారులకు యూజీసీ న్యాక్ గుర్తింపు టెన్షన్ పట్టుకుంది. గతంలో లభించిన న్యాక్ ఎ-ప్లస్ గుర్తింపును సాధించేందుకు వీసీ ప్రొ.కుమార్‌తో ఇతర అధికారులు తీవ్రంగా కృషిచేస్తున్నారు. ఎగ్జామినేషన్ బ్రాంచ్, దూరవిద్య, పీజీ అడ్మిషన్స్, విద్యార్థులు, ప్రొఫెసర్ల సంఖ్య, ప్లేస్‌మెంట్స్, తదితర అనేక అంశాలను క్రోడీకరించి యూజీసీకి ఆన్‌లైన్ సమర్పిస్తున్నారు. న్యాక్‌పట్ల అవగాహన కోసం మార్చి 3, 4, 5 తేదీలలో పర్మనెంట్, కాంట్రాక్టు, పార్టుటైం అధ్యాపకులకు క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో సదస్సును ఏర్పాటు చేశారు.రెండో సారీ కూడ న్యాక్ ఎ-ప్లస్ గ్రేడ్‌ను సాధించి తీరుతామని ఓయూ అధికారులు ధీమా వ్యక్తం చేశారు.

చిన్నారుల ఎదుగుదలకు 'బాలామృతం'..

● తప్పనిసరిగా తినిపించాలంటున్న అంగన్‌వాడీ టీచర్లు..
● ఎన్నో ప్రయోజనాలతో కూడిన ఆహారం
● పోషక విలువలు మెండు


తల్లులకు బాలామృతం ప్యాకెట్లు అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్..

బంజారాహిల్స్: చిన్నారుల్లో బలహీనత, రక్తహీనత, పోషణ లోపాల నివారణకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలామృతం పంపిణీ చేస్తోంది. బలవర్థకమైన ఈ ఆహారంపై క్షేత్ర స్థాయిలో అవగాహన లేక చాలామంది తల్లిదండ్రులు పోషకాలతో నిండి ఉన్న బాలామృతాన్ని పిల్లలకు తినిపించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. పిల్లల్లో పోషణ లోపం పోవాలన్నా, రక్తహీనత నివారణకు బాలామృతాన్ని ప్రతిరోజూ తినిపించాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు సూచిస్తున్నారు. అంగన్‌వాడీ టీచర్లు సైతం తప్పనిసరిగా తమ పరిధిలోని పిల్లలకు నెలకో సంచి చొప్పున బాలామృతాన్ని అందజేస్తున్నారు. ఖైరతాబాద్ ఐసీడీఎస్ పరిధి కిందికి వచ్చే సోమాజిగూడ, ఖైరతాబాద్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వర కాలనీ, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ, వెంగళరావునగర్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలోని 151 అంగన్‌వాడీ కేంద్రాల్లో 16,156 మంది పిల్లలు ఆటాపాటలతో కూడిన విద్యా బోధన అందిస్తున్నారు. వీరికి పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నారు. ఆరు నెలల నుంచి ఆరేళ్ల లోపు పిల్లలకు ఆటపాటలతో కూడిన బోధనతో పాటు తప్పనిసరిగా బాలామృతాన్ని అందించేందుకు ప్రణాళికలు రూపొందించుకుని పటిష్టంగా అమలు చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఎదుగుదలకు, మానసిక వికాసానికి, జ్ఞాపకశక్తి పెరుగుదలకు బాలామృతం దోహద పడుతుందని అంగన్‌వాడీ టీచర్లు పేర్కొంటున్నారు. కొద్ది రోజుల క్రితం ఐసీడీఎస్ ఖైరతాబాద్ జోన్ పరిధిలో నిర్వహించిన సర్వేలో 1450 మంది చిన్నారుల్లో తీవ్ర, అతి తీవ్ర పోషణ లోపం ఉన్నట్లుగా గుర్తించి వారికి బాలామృతం ప్లస్ అందిస్తున్నారు. ఇది క్రమం తప్పకుండా తినిపించడం వల్ల ఆరు నెలల్లోనే గణనీయమైన మార్పు కనిపిస్తుండడంతో చాలామంది తల్లిదండ్రులు దీని వైపు మొగ్గుచూపుతున్నారు. బాలామృతం ప్లస్‌లో వేయించిన గోధుమలు, శెనగపప్పు, పాల పొడి, పల్లీలు, అటుకులు, పంచదార, నూనెతో పాటు క్యాల్షియం, ఐరన్, విటమన్-ఏ, బీ1, బీ2, బీ12, సీ, ఫోలిక్ యాసిడ్, నియాసిన్, జింక్, మాంసకృత్తులు ఉంటాయి. వీటన్నింటి సమ్మేళనమే బాలామృతం.

శివరాత్రికి పకడ్బందీ ఏర్పాట్లు చేయండి


ఆర్డీఓ వెంకట ఉపేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న అంగముత్తు శ్రీనివాస్

పద్మారావునగర్: మహాశివరాత్రి సందర్భంగా కీసరగుట్టలోని శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని తమిళ సంఘం నాయకులు అంగముత్తు శ్రీనివాస్ ఆర్డీఓకు విజ్ఞప్తి చేశారు. గురువారం అంగముత్తు శ్రీనివాస్ కీసర డివిజన్ ఆర్డీఓ కె. వెంకట ఉపేందర్ రెడ్డిని కలిసి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ రాసిన ఉత్తరాన్ని ఆర్డీఓకు అందజేశారు.

ఏఐజీలో ఎమ్మెల్యే గోపీనాథ్‌కు చికిత్స

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆరోగ్య సమస్యలతో గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మూడురోజుల క్రితం ఆరోగ్య పరీక్షల నిమిత్తం ఏఐజీ ఆసుపత్రికి వెళ్లిన ఎమ్మెల్యేకు పలు పరీక్షలు నిర్వహించిన వైద్యులు మరిన్ని పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందించాలని సూచించడంతో ఆసుపత్రిలో చేరారు. వైద్యులు కిడ్నీతో పాటు పలు పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు.